నాణ్యమైన ఆహారం అందించాలి

- జిల్లా విద్యాధికారి రేణుకాదేవి
- పరిగిలోని జడ్పీ హైస్కూళ్ల సందర్శన

పరిగిలోని జడ్పీహెచ్ఎస్ నం.1లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జిల్లా విద్యాధికారి రేణుకాదేవి

పరిగి, నవంబర్ 23 : విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని వికారాబాద్ జిల్లా విద్యా శాఖ అధికారి రేణుకా దేవి సూచించారు. శనివారం పరిగి పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ నం.1, 2లను రేణుకాదేవి సందర్శించి మధ్యాహ్న భోజనం తయారీ, బియ్యం, కూరగాయలను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వంటచేసే ఏజెన్సీవారితో డీఈవో మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం వండి పెట్టాలని చెప్పారు. శుభ్రమైన కూరగాయలు ఉపయోగించాలన్నారు. పాఠశాలలోని మరుగుదొడ్లు, డ్రైనేజీ లైన్, కిచెన్‌షెడ్ సమస్యలను ప్రధానోపాధ్యాయుడు గోపాల్ జిల్లా విద్యా శాఖ అధికారి దృష్టికి తీసుకువెళ్లారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని డీఈవో చెప్పారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీవారికి రావాల్సిన బకాయిలు జమ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి డీఈవో, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, మండల విద్యాధికారి గోపాల్ భోజనం చేశారు. అంతకుముందు విద్యార్థులను కలిసి వారికి అందుతున్న విద్యాబోధనను అడిగి తెలుసుకున్నారు.


జన జాగృతి అధ్యక్షురాలు కవితను మర్యాదపూర్వకంగా కలిసిన ఉద్యమకారులు శకుంతల, దత్తాత్రేయరావు తదితరులు

జాగృతి సంస్థకు త్వరలో పూర్వ వైభవం

తాండూరు, నవంబర్ 23 : జాగృతి సంస్థకు త్వరలో పూర్వ వైభవం వస్తుందని తెలంగాణ ఉద్యమకారులు శకుంతల, దత్తాత్రేయ రావు అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో జన జాగృతి అధ్యక్షురాలు కవిత ఆధ్వర్యంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. వచ్చే ఎన్నికల్లో జన జాగృతి సత్తా చాటబోతుందన్నారు. త్వరలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మీడియా కమిటీలను ఏర్పాటు చేసుకోబోతున్నామన్నారు. నిరుద్యోగులకు, రైతులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్ఎస్ మహిళా కన్వీనర్ శకుంతల దేశ్‌పాండే, జిల్లా నాయకులు శ్రీనివాస్, దత్తాత్రేయ ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్

నందిగామ, నవంబర్ 23 : పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని గుజరాత్ రాష్ట్ర గవర్నర్ ఆచార్య దేవవ్రత్ అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా శాంతి వనాన్ని శనివారం గుజరాత్ రాష్ట్ర గవర్నర్ ఆచార్య దేవవ్రత్ సందర్శించారు. ఈ సందర్భంగా హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన గురువు కమలేశ్‌పటేల్‌తో కలిసి కన్హాలోని నర్సరీ, టిష్యూ కల్చర్ ల్యాబ్, గోపిచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ, ధ్యాన కేంద్రాన్ని పరిశీలించి కన్హాలో మొక్కలను నాటారు. అనంతరం ధ్యాన కేంద్రంలో కొద్దిసేపు ధ్యానం చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. కన్హా శాంతివనాన్ని సందర్శించడం సంతోషంగా ఉందని, ఆహ్లాదకరమైన వాతావరణం ఎంతో అకట్టుకుందన్నారు. హార్ట్‌ఫుల్‌నెస్ ద్వారా చేస్తున్న అనేక కార్యక్రమాలు ప్రపంచానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని, హార్ట్‌ఫుల్‌నెస్ సేవలను అభినందించారు. ధ్యానం చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు.

కన్హాలో మొక్క నాటుతున్న గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్

ఆమనగల్లులో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్

ఘనంగా ఆర్ఎస్‌పీ జన్మదిన వేడుకలు

ఆమనగల్లు, నవంబర్ 23 : బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఐపీఎస్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ జన్మదిన వేడుకలు బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్‌గౌడ్, సీనియర్ నాయకులు రఘు, పంతూనాయక్, శ్రీనూనాయక్, అంజినాయక్, బాలస్వామి, రమేశ్‌నాయక్, ప్రసాద్, యాదయ్య, దేవేందర్, గణేశ్, రాజు, ఆనంద్, ధన్‌రాజ్ పాల్గొన్నారు.

షాబాద్ : స్వేరో ఫౌండర్, బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ జన్మదిన వేడుకలను షాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. శనివారం అంబేద్కర్ విగ్రహం వద్ద స్వేరో నాయకులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో స్వేరో నాయకులు శ్రీశైలం, ప్రదీప్, స్వామి, రాంబాబు, జంగయ్య, జహంగీర్, నర్సింహ, రాజు, వెంకటయ్య ఉన్నారు.

జడ్పీ బాలుర పాఠశాలలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

ప్రత్యేక ఓటరు నమోదు పరిశీలన

కొడంగల్, నవంబర్ 23 : ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా రెండు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా బూత్‌లవారీగా జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ శనివారం సందర్శించి పరిశీలించారు. ప్రత్యేక ఓటరు నమోదుకు సంబంధించి బూత్ లెవల్ అధికారులకు పలు సూచనలు, సలహాలను అందించారు. ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపులో బీఎల్‌వోలు విధిగా అందుబాటులో ఉండాలని, కొత్త ఓటర్లకు అవగాహన కల్పించి ఓటరుగా నమోదు చేసుకునేలా సహకరించాలని తెలిపారు. జాబితాలో ఓటర్లకు మార్పులు చేర్పులు చేసుకునే అవకాశం ఉంది కాబట్టి సద్వినియోగం చేసుకోవాలని, సరళమైన ఓటరు జాబితా ఏర్పడేలా అందరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఆలయాల్లో వరుస దాడులు జరగడం దురదృష్టకరం

- వివేకానంద కాలనీలో విగ్రహాల ధ్వంసానికి పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

షాద్‌నగర్, నవంబర్ 23 : రాష్ట్రంలోని హిందూ ఆలయాలపై వరుసగా దాడులు జరగడం దురదృష్టకరమని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శనివారం షాద్‌నగర్ మున్సిపాలిటీ ఫరూఖ్‌నగర్ వివేకానంద కాలనీలోని ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు విగ్రహాల ధ్వంసానికి పాల్పడిన స్థలాన్ని పరిశీలించిన అనంతరం మాట్లాడారు. రాష్ట్రంలో మత కల్లోలాలను సృష్టించి ఆశాంతిని నెలకొల్పేందుకు పలువురు దుండగులు ప్రయ్నతిస్తున్నారని, వారిని గుర్తించి శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి హిందూ ఆలయం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.


వివేకానంద కాలనీలో విగ్రహాలు ధ్వంసమైన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీ డీకే అరుణ

ప్లాట్లు అమ్ముతామని.. కిడ్నాప్

- తలపై తుపాకి పెట్టి కోటి రూపాయలు డిమాండ్
- సంతకాలు, వేలిముద్రలు తీసుకున్న ఆగంతకులు
- బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు

ఆదిబట్ల, నవంబర్ 23 : మహిళా వాయిస్‌తో ఫోన్ కాల్ చేసి కారు ఇన్సూరెన్స్ చేస్తామని చెప్పి మాకు బొంగుళూరులో ప్లాట్లు ఉన్నాయి.. అమ్ముతామని పిలిపించుకుని ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసిన సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఇబ్రహీంపట్నం బోయవాడ కాలనీకి చెందిన రాచ నారాయణ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. నారాయణకు గత 10 రోజులుగా ఓ మొబైల్ నుంచి మహిళా వాయిస్‌లో ఫోన్ చేసి.. ఆయన కారుకు ఇన్సూరెన్స్ చేస్తామని చెప్పి.. తమకు ఆదిబట్ల, బొంగుళూరు ప్రాంతాల్లో ప్లాట్లు ఉన్నాయని వాటిని అమ్మడానికి పెట్టామని చెప్పారన్నారు. నారాయణను బొంగుళూరు మెట్రో సిటీ వెంచర్ వద్దకు రప్పించుకున్నారు. నారాయణ తన డ్రైవర్ ముసిఫ్‌ఖాన్‌తో కలిసి అక్కడికి వెళ్లాడు. వారు అక్కడ వేచి ఉండగా ఇంతలో నలుగురు వ్యక్తులు వచ్చి వారిని కారులో ఎక్కించుకుని ముఖానికి నల్లటి మాస్కులు కప్పి అక్కడి నుంచి గుర్తు తెలియని ప్రాంతానికి తీసుకుపోయారు. ఆ వ్యక్తులు ఇద్దరి సెల్‌ఫోన్లను, కారు తాళం తీసుకున్నారు. 45 నిమిషాల తరువాత వారిని ఓ గదిలోకి తీసుకుపోయి అక్కడ ఓ వ్యక్తి పోలీస్ యూనిఫాంలో ఉండి నారాయణ తలపై తుపాకి పెట్టి వెంటనే కోటి రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో నారాయణ తన వద్ద అంత డబ్బు లేదని చెప్పడంతో, ఆ నిందితులు 10 పేపర్లపై సంతకాలు, వేలిముద్రలు తీసుకున్నారు. తరువాత ఆ నిందితులు వారికి సెల్ ఫోన్లు, కారు తాళం ఇవ్వడంతో పాటు వారిని ఓ నిర్మానుష్య ప్రాంతంలో వదిలి పెట్టి వెళ్లారు. తమను కిడ్నాప్ చేసి సంతకాలు, వేలిముద్రలు తీసుకున్నవారిపై తగు చర్యలు తీసుకోవాలని నారాయణ ఫిర్యాదు చేశాడని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కుటుంబ సర్వే

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

సమగ్ర ఇంటింటి సర్వేలో సమాచారాన్ని ఇస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్, నవంబర్ 23 : ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కుటుంబ సర్వే నిర్వహించడం జరుగుతున్నదని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ ఎన్యుమారేటర్‌కు పూర్తి సమాచారాన్ని ఇచ్చి ఫారంపై సంతకాలు చేశారు. ఇప్పటికే జిల్లాలో 86 శాతం కుటుంబ సర్వే పూర్తయిందన్నారు.

అర్బన్ పార్కును అభివృద్ధి చేస్తాం

పర్యాటకులకు ఆహ్లాద వాతావరణాన్ని కల్పించేందుకు అనంతగిరి అర్బన్ పార్కును అభివృద్ధి చేయడం జరుగుతుందని స్పీకర్ అన్నారు. శనివారం అనంతగిరి అటవీ ప్రాంతంలో అర్బన్ పార్క్ నిర్మాణానికి శంకుస్థాపన, రూ.22లక్షలతో నిర్మించిన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ క్వార్టర్‌ను కలెక్టర్ ప్రతీక్‌జైన్, అటవీశాఖ జోనల్ చీఫ్ కన్జర్వేటర్ ప్రియాంక వర్గీస్‌లతో కలిసి ప్రారంభించారు. అనంతగిరి అటవీ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూ.300 కోట్లతో ప్రణాళికలు రూపొందించడం జరుగుతున్నదన్నారు. ఇందులో భాగంగా 200 ఎకరాల్లో, రూ.2కోట్ల నిధులతో అనంతగిరి అర్బన్ పార్కును ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమాల్లో కలెక్టర్ ప్రతీక్‌జైన్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, డీసీసీబీ డైరెక్టర్ కిషన్‌నాయక్, ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ ఉన్నారు.

దివ్యాంగుడికి డాక్టరేట్

మొయినాబాద్, నవంబర్ 23 : మొయినాబాద్ మండల పరిధిలోని పెద్దమంగళారం రెవెన్యూ పరిధిలో ఉన్న మమత పాఠశాలలో దివ్యాంగుడైన కవి గాయకుడు ఆరింపుల జానయ్య హిందీ పండిత్‌గా పని చేస్తున్నారు. విద్యార్థులకు విద్యా బోధన చేయడంతోపాటు పాటలు పాడటం, కవిత్వాలు రాయడం, జానపద గీతాలు పాడటం ఆయన సొంతం. హైదరాబాద్ ఫ్రెండ్‌షిప్ మినిస్ట్రీ అనే సంస్థ వారు జానయ్య కళా నైపుణ్యాన్ని గుర్తించి జానపద కవి గాయకుడిగా హైదరాబాద్‌లోని అల్లైడ్ ఆర్టిస్టు ఆడిటోరియంలో సాహిత్యవేత్తలు, మా అసోసియేషన్ చైర్మన్, ప్రభుత్వ అధికారులు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జానయ్య మాట్లాడుతూ.. జానపద కవి గాయకుడిగా గుర్తింపు పొంది అందులో డాక్టరేట్ పొందడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. జానపద గీతాలు, ప్రజలకు సంబంధించిన కవిత్వాలు మరింత రాయడానికి కృషి చేస్తానని తెలిపారు. డాక్టరేట్‌తో సమాజంలో తమ భాగస్వామ్యాన్ని మరింత పెంచిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మా అసోసియేషన్ ఈసీ మెంబర్ డాక్టర్ మాణిక్‌రావు, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ గంగాధర్, సిటీ సివిల్ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ పీవీసీ అంజనికుమారి, సినీ నిర్మాత, కవి గాయకుడు డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, యాంకర్ రజని పాల్గొన్నారు.

డాక్టరేట్ పట్టా పొందుతున్న జానయ్య

ఎంబీఏ వన్ టైం చాన్స్ పరీక్ష తేదీల మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 23: ఓయూ పరిధిలోని ఎంబీఏ వన్ టైం చాన్స్ సప్లమెంటరీ పరీక్ష తేదీలను మార్చినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (సీబీసీఎస్, నాన్ సీబీసీఎస్) వన్‌టైం చాన్స్ అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను వచ్చే నెల 11వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు గతంలో ప్రకటించామని, పరీక్షలను అదే రోజు నుంచి నిర్వహిస్తున్నప్పటికీ, వివిధ పరీక్ష తేదీలను మార్చినట్టు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

బీఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 23: ఓయూ పరిధిలోని బీఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల మొదటి, మూడు, అయిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును వచ్చే నెల 5వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో 10వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. పరీక్షలను వచ్చే నెల లోనే నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఎల్ ఎల్ ఎం జవాబు పత్రాల నకలుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 23: ఓయూ పరిధిలోని ఎల్ఎల్ఎం పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఎల్ఎం నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి వచ్చే నెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఎంపీఈడీ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 23: ఓయూ పరిధిలోని మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఎంపీఈడీ) పరీక్ష తేదీలను ఖరారు చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 3వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac. inలో అందుబాటులో ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు.

పేదలకు అండగా ఉంటా..

ఎమ్మెల్యే సబితారెడ్డి

బాచుపల్లి గ్రామ బాధితులతో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు, నవంబర్ 23 : బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని బాచుపల్లి గ్రామానికి చెందిన పగడాల రాఘవేందర్ అబ్బుల్లాపూర్‌మెట్ వద్ద వరద తాకిడికి వాగులో కొట్టుకుపోయి మృతి చెందాడు. దీంతో బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం సబితా ఇంద్రారెడ్డి కృషి వల్ల నష్ట పరిహారం కింద రూ. 4లక్షలు మంజూరు చేసింది. డబ్బులను నేటికీ విడుదల చేయకపోవడంతో మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్యేను కలిసి సమస్యను విన్నవించారు. కుటుంబ పెద్ద లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని మృతుడి భార్య చెప్పడంతో వెంటనే సబితా ఇంద్రారెడ్డి రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయ డీఆర్‌వోకు ఫోన్ చేసి మంజూరైన డబ్బులు ఇవ్వడంలో ఎందుకు ఆలస్యం జరుగుతున్నదని అడిగి తెలుసుకున్నారు. సబితా ఇంద్రారెడ్డి చొరవతో రెండు రోజుల్లో బాధితులకు డబ్బులు అందజేస్తామని తెలిపారు.

ట్రై సైకిల్ అందజేత

దన్నారం గ్రామానికి చెందిన దివ్యాంగుడు కొంగర సత్తయ్య తనకు నడవడానికి ఇబ్బందిగా ఉన్నదని ఎమ్మెల్యేను ఆశ్రయించడంతో శనివారం దివ్యాంగుడిని క్యాంపు కార్యాలయానికి పిలిచి మానవతా దృక్పథంతో ట్రై సైకిల్‌ను అందజేశారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. దివ్యాంగులు అధైర్యపడవద్దని తెలిపారు.

శ్మశానవాటిక పనులు ప్రారంభించాలి

ఆర్కేపురం : సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని కుతుబ్‌షాహీ మసీద్ గ్రేవ్ యార్డ్ పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం సరూర్‌నగర్ డివిజన్ వార్డు మెంబర్ మహ్మద్ జహీర్ ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి నేతృత్వంలో రూ.కోటీ80లక్షలతో శ్మశానవాటిక పనులు చేపట్టేందుకు నిధులు విడుదల చేశారని తెలిపారు. అంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో పనులు ప్రారంభించలేదన్నారు. పనులు వెంటనే ప్రారంభించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యేను కలిసి కోరామన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పనులు ప్రారంభించేలా చూస్తానని ఎమ్మెల్యే తెలిపినట్లు చెప్పారు.

సమస్యలు పరిష్కరించాలి

బడంగ్‌పేట : జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎంపీటీసీ అబ్జల్, బీఆర్ఎస్ పార్టీ ప్రెసిడెంట్ షర్ఫొద్దీన్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితారెడ్డిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు పనులను పరిష్కరించాలన్నారు. కొన్ని పనులు శంకుస్థాపనలు చేసిన తర్వాత కూడా పనులు చేయడం లేదని తెలిపారు. అందుకు సబితారెడ్డి స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడారు. జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్‌కు ఫోన్ చేసి పనులు త్వరగా పూర్తి చేయించాలని ఆదేశాలు జారీ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రోడ్లకు ప్రత్యేక నిధులు కేటాయించామని తెలిపారు. సగం పనులు పూర్తి చేసిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నిధులను రద్దు చేశారన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీకి మంజూరైన రూ.25కోట్లు రద్దు చేయడం వలన పనులు ఆగిపోవడం జరిగిందన్నారు. రద్దు చేసిన నిధులను ప్రభుత్వం తిరిగి ఇవ్వాలన్నారు.

రూ.5 భోజనం ఏర్పాటు చేయాలి

శంషాబాద్ రూరల్, నవంబర్ 23 : శంషాబాద్‌లో అడ్డా కార్మికుల కోసం రూ.5 భోజనం క్యాంటిన్ ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నర్ర గిరి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శంషాబాద్ పట్టణంలో భవన నిర్మాణ రంగంతో పాటు ఇతర రంగాల్లో పని చేస్తున్న కార్మికుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.5 భోజనం క్యాంటిన్ ఏర్పాటు చేసి వారి ఆకలి తీర్చాల ని కోరారు. ఉదయం 8 గంటల నుంచి భవ న నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులు గంటల తరబడి నిలబడి పని దొరకకపోవడంతో తిరిగి ఇంటికి వెళ్తున్నారు. వారికి రూ.5 భోజనం ఏర్పాటు చేస్తే కనీసం ఒక్కపూట భోజనం చేస్తారని వివరించారు.

స్వయంభు శివలింగానికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొనసాగుతున్న జాతర

మంచాల, నవంబర్ 23 : బుగ్గరామలింగేశ్వరస్వామి జాతర ఉత్సవాలు శనివారానికి 9వ రోజుకు చేరుకున్నాయి. కార్తిక స్నానాలు ఆచరించేందుకు ఉదయం నుంచి భక్తులు వివిధ ప్రాంతాల నుంచి స్వామివారి సన్నిధానానికి తరలివచ్చారు. గుండంలో స్నానాలు ఆచరించిన అనంతరం స్వామివారిని దర్శించుకొని స్వయంభు శివలింగానికి పూజలు చేశారు. ఆలయ ఆవరణలో మహిళలు కార్తిక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు.

భక్తులతో కిటకిటలాడుతున్న బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం

డీడీఎంఎస్ ఒకేషనల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 23: దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ ఒకేషనల్ కోర్స్ సెంటర్‌లో పలు కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్‌కేర్ మల్టీపర్పస్ వర్కర్ (నర్స్ కోర్స్), ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డయాలసిస్ అసిస్టెంట్, ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ సర్టిఫికెట్ కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత 10వ తరగతి అని వివరించారు. రేడియోగ్రఫీ అసిస్టెంట్, రెస్పిరేటరీ థెరపీ టెక్నీషియన్, ఈసీజీ, మెడికల్ ల్యాబ్, కార్డియాలజీ, క్యాథ్‌ల్యాబ్, పర్ఫ్యుజన్ టెక్నీషియన్ల వంటి పారా మెడికల్ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత ఇంటర్మీడియట్ అని చెప్పారు. అన్ని వయసుల వారు కోర్సుల్లో చేరేందుకు అర్హులని తెలిపారు. కోర్సుల్లో చేరేందుకు ఈనెల 30వ తేదీ ఆఖరు అని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 83090 37134, 63058 95867 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.